ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 17 ఆగస్టు 2024



విద్యుత్ కష్టాలను నిరసిస్తూ..

సబ్ స్టేషన్ ముట్టడి

8లో..



జగిత్యాల జిల్లా వర్షకొండ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఓటరు నమోదుకు మరో అవకాశం

- చిరునామా మార్పు, మృతుల పేర్లు తొలగింపునకు చర్యలు
- 18 ఏళ్లు నిండిన వారందరికీ..
- నమోదుతో పాటు జాబితా నుంచి పేర్ల తొలగింపు..
- తప్పు ఒప్పుల సవరణ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కోసం దరఖాస్తుల స్వీకరణ





జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త ఓటరు నమోదుకు మరోమారు అవకాశం వచ్చింది. అడ్రస్ మార్పులు, తప్పు ఒప్పుల సవరణలు, మృతుల పేర్లు తొలగించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈమేరకు జిల్లా అధికారులకు మార్గదర్శకాలు అందాయి. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న వారు కొత్తగా ఓటరు నమోదు చేయించుకోవడానికి అర్హులని అధికారులు పేర్కొంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పిస్తున్నారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటరు జాబితాలో కొత్తగా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జిల్లాలో 7,14,761 మంది ఓటర్లు...

జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు ఉండగా ఈనెల 16వ తేదీ నాటికి 7,14,761 మంది ఓటర్లున్నారు. ఇందులో 3,71,512 మంది పురుషులు, 3,43,213 మంది మహిళలు, 36 మంది ఇతరులున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 2,46, 350 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,16, 898 మంది పురుషులు కాగా, 1,29,448 మంది మహిళలు,నలుగురు ఇతరులున్నారు.ధర్మపురి నియోజకవర్గంలో 2,31,053 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,12,585 మంది పురుషులు కాగా, 1,18,461 మంది మహిళలు, ఏడుగురు ఇతరులున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,37,358 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,13,730 మంది పురుషులు, 1,23,603 మంది మహిళలు, 25 మంది ఇతరులు ఉన్నారు.

ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ...

బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరించనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారి ఇంటింటికీ పర్యటించి వివరాలను ఆరా తీయనున్నారు. అర్హత కలిగిన వారిని కొత్తగా ఓటరుగా నమోదు చేయించడంతో పాటు మృతుల వివరాలను తొలగించనున్నారు. అవసర మైన వారి చిరునామా మార్చనున్నారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుంటే సేకరిస్తారు. ఫొటో సరిగా లేకుంటే మరొకటి తీసుకొని జాబితాలో చేరుస్తారు. జిల్లా వ్యాప్తంగా 785 మంది బూత్ లెవల్ అధికారు లున్నారు. ఇందులో కోరుట్ల నియోజకవర్గంలో 262 మంది, జగిత్యాలలో 254 మంది, ధర్మపురిలో 269 మంది బీఎల్‌వోలు పనిచేస్తున్నారు.

యువతకు అవకాశం...

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ తరువాత డిగ్రీ, ఇతర సమానమైన కోర్సుల్లో ప్రతీ సంవత్సరం సుమారు 6 వేల నుంచి 7 వేల మంది విద్యార్థులు చేరుతున్నారు. ఈ లెక్కన ప్రతీ సంవత్సరం సుమారు 6 వేల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఓటు హక్కుకు అర్హత సాధిస్తుంటారు. కానీ నమోదులో మాత్రం వెనుకంజలో ఉంటున్నారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం యువత చాలా మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. రానున్న కొద్ది రోజుల్లో పంచాయతీ, మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ జరిగే అవకాశాలున్నాయి. ఈనేపథ్యంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఓటరు నమోదుపై కొంత అవగాహన కల్పిస్తే నమోదు శాతం పెరిగే అవకాశాలు న్నాయి. యువతీ యువకులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను అందిస్తే ఓటరుగా నమోదు కావచ్చని విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవడానికి వీలున్న అంశాన్ని సైతం అర్హులైన యువతీ యువకులకు వివరించడంపై అధికారులు దృష్టి సారించారు.

ఏ పత్రం దేనికి...

జిల్లాలో 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా న మోదు చేసుకోవచ్చు. నూతన ఓటర్లు ఫారం- 6ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. గతంలో మాదిరి కాకుండా ఇంటి నుంచే ఎన్నికల సంఘం ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు ఫొటోలు, వయసు ధ్రువీకరణ కోసం పదవ తరగతి మెమో, చదువుకోని వారు ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం లేదా విద్యుత్ బిల్లు సమర్పించాల్సి ఉంటుంది. ఇక చిరునామా మార్పు, ఓటర్ల జాబితాలోని వివరాల సవరణ, వైకల్యం గుర్తింపు కోసం ఫారం-8 ఉపయోగపడుతుంది. ఫారం-6 ఏ విదేశాల్లో నివాసముంటున్న భారతీయులు ఓటు నమోదుకు, ఫారం-6 బీ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానానికి, ఫారం-7 ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, పేరు తొలగింపునకు వినియోగించుకోవాలని అధికారులు వివరిస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

ఓటరు నమోదు కార్యక్రమం, ఓటరు జాబితా విడుదలకు అవసరమైన మార్గదర్శకాలను ఎన్ని కల కమిషన్ ఇటీవల విడుదల చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటి పరిశీలన జరగనుంది. అక్టోబర్ 19వ తేదీ నుంచి అక్టోబర్ 28వ తేదీలలో ఓటరు లిస్టు డ్రాఫ్ట్ రోల్ తయారీ నిర్వహించనున్నారు. అక్టోబర్ 29వ తేదీన డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ చేయనున్నారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 28వ తేదీ వరకు డ్రాఫ్ట్‌రోల్‌పై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. డిసెంబర్ 24వ తదీ వరకు సంబంధిత అభ్యంతరాలు, ఫిర్యాదులపై పరిశీలన జరుపనున్నారు. 2025 జనవరి 1వ తేదీన తుది ఆరోగ్యకరమైన ఓటరు జాబితాను తయారు చేసి 2025 జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకే...

ఎంఏ హకీం, కలెక్టరేట్ కార్యాలయ సెక్షన్ సూపరింటెండెంట్



ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందిస్తాము. ఇందులో భాగంగా ఇప్పటికే షెడ్యూల్ వెలువడింది. సంబంధిత షెడ్యూల్ ప్రకారం పక్కాగా ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు కార్యక్రమాలను నిర్వహించనున్నాము. 2025 జనవరి 6వ తేదీ నాటికి తుది ఓటరు జాబితాను ప్రకటిస్తాము.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

జిల్లా కోఆర్డినేటర్ అశ్విని

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ అశ్విని అన్నారు. సాధికారత బృందం నిర్వహిస్తున్న 100డేస్ స్పెషల్ అవేర్‌నెస్ ఫర్ సంకల్ప్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక నర్సింగ్ కళాశాలలో షీటీమ్స్, సైబర్ క్రైమ్ వారి సహకారంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అశ్విని మాట్లాడుతూ లింగ సమానత్వం, లింగ వివక్షత, పోక్సో ఆక్ట్, భేటీ బచావో-బేటీ పడావో తదితర చట్టాలు, పథకాలను గురించి విద్యార్థినులకు వివరించామన్నారు. సఖి అందించే సేవలు, సైబర్ నేరాలు, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి సైబర్ క్రైం టీం సభ్యులు రాజేందర్ వివరించారు. వీటితో పాటు 181, 1098, చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి అందించే సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధారాణి, షీటీమ్ ఎస్సై అలీబేగ్, కానిస్టేబుల్ రాజహూజిత, జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, స్వప్న, చైల్డ్ హెల్ప్‌లైన్ స్టాఫ్ మానస, రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల అమలు ఓర్వలేకనే విమర్శలు'

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సక్సెస్ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నా రని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలంటే మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీ ఏమాత్రం గౌర వం లేదనే విషయాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాటల వల్లనే స్పష్టం అవుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకున్న ఫర్వాలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల ఆయనకు ఉన్న గౌరవం, సంస్కారానికి నిదర్శనం అన్నారు. మహిళలకు ప్రయాణభారం కావద్దనే ఉద్దేశ్యంతోనే ఉచిత రవాణా స్కీంను ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేసిందన్నారు. మహిళలను అవమానించిన కేటీఆర్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మేరు సంఘం కార్యవర్గం

రాయికల్, ఆగస్టు 16: రాయికల్ మేరు సంఘం నూతన అధ్యక్షుడిగా సంగ విశ్వనాథం ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా మాడిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శిగా సింగు ఆనంద్, సహ కార్యదర్శిగా రాయిల్ల జనార్ధన్ ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా కొట్నూరి సత్తయ్య, కార్యవర్గ సభ్యులుగా సింగు వినోద్, గంగాధర్, శాలివాహన్, సింగు గణేష్, మాడిశెట్టి లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో జిల్లా కోశాధకారి రాపర్తి నర్సయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయిల్ల ప్రభాకర్, నరేందర్, రాజేశం, సత్తయ్య, శివ, శ్రీనివాస్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 : ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో రూపొందించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని మోతె ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అమలతవుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రవీందర్‌రాయక్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పథకాలు అమలుతీరును పరిశీలించడాని కోసమే జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించానని తెలిపారు. అంతకు ముందు మోతె ఆరోగ్య ఉప కేంద్రంలో కాలానుగుణంగా వ్యాధుల పట్ల సంసిద్ధత, ఓపీ వివరాలు అందులో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ సేవలు, ప్రసవాలగూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వివిధ ఆరోగ్యసేవల విషయంలో పూర్తి సంతృప్తివ్యక్తపరిచారు. సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవ సేవలను మెరుగుపరచాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమియొద్దీన్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు జైపాల్‌రెడ్డి, అర్చన, రవీందర్, ఏఎంవో సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, ఆగస్టు 16: మండలంలోని రాంపూర్, పోతారం, తాటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు జరుగనున్నందున రాంపూర్, ఒడ్డెర కాలనీ, ఓబులాపూర్, పోతారం. రాజారం, తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ రావు



వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల, ఆగస్టు 16 : దేశ ప్రధానిగా వాజ్‌పేయి చేసిన సేవలు గొప్పవని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ రావు అ న్నారు. శుక్రవారం పట్టణంలోని సురభి భవనంలో మాజీ ప్రదాని వాజ్‌పేయి వర్ధంతి ని ర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి వాజ్‌పాయి చిత్ర పటానికి పూలమాల వేసి ని వాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌రావు మాట్లా డారు. నదుల అనుసంధానం రహదారుల విస్తరణ లాంటి కార్యక్రమాలను చెపట్టి దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత వాజ్‌పేయికి దక్కుతుందన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెండం గణేష్, తిరుమల వాసు, విఘ్నేష్, పీసరి నర్సయ్య, సుదవేణి మహేష్, కలాల సాయిచంద్, పోతుటంటి శ్రీనివాస్, సోరపాక రమేష్, నాగరా జులతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో నాయకులు మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పేయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం ఇచ్చిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన భారత జాతికి చేసిన సేవలు అజరామరం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఏసీఎస్ రాజు, కాశీనాథం, షమియొద్దీన్, గంగారాం, భూమయ్య, బాలయ్య, సంపత్ రావు, మురళి, రాజన్న, గంగారాం, అంజన్న తదితరులున్నారు.

●జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పే యి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

దంచికొట్టిన వాన

●మత్తడి దూకిన చెరువులు.. ●ఉప్పొంగిన వాగులు



గొర్రెపల్లి శివారులోని లోలెవల్ వంతెనపై ఉదృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

మల్యాల, ఆగస్టు 16: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లోని చెరువులు నిండి మత్తళ్ల దూకుతున్నాయి. ఒర్రెలు వర్షపు నీటితో ప్రవహిస్తున్నాయి. మల్యాల అంగడిబజారు ప్రాంతం, గ్రామాల్లోని రహదారులు నిండి పోయాయి. మల్యాలలోని మత్తడి చెరువు తదితరవి అలుగు పారుతున్నాయి.

● కొండగట్టు అంజన్న సన్నిధిలో..

భారీ వర్షానికి కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. గంట సేపు కురిసిన వర్షానికి ఇబ్బందులు పడ్డారు. వాహన పూజల వద్ద వాహన పూజలు నిలిచిపోయాయి. పూజల షెడ్డు రేకులు సరిగా లేక వర్షపు నీరు కిందకు రావడంతో భక్తులు తడుస్తూనే నిలుచున్నారు.

నీట మునిగిన రహదారులు

మెట్‌పల్లి రూరల్ : మండలంలో కురిసిన భారీ వర్షానికి రహదారులు నీట మునిగాయి. శుక్రవారం మండలంలో మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోతగా వర్షం కురిసింది. రహదారులు, పల్లపు ప్రాంతాలు నీటము నిగాయి. పల గ్రామాల్లో డ్రైనేజి నీరు రోడ్లపై ప్రవహించడంతో పాఠశాలల విద్యా ర్థులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి రహదారిపై ఉన్న గోతులు నీటితో నిండిపోవడంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు.

జలమయమైన రహదారులు

మల్లాపూర్: భారీ వర్షంతో మండలంలోని రహదారులు చెరువులను తలపించారు. శుక్రవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయ్యాయి. కురిసన భారీ వర్షానికి మండలంలోని గొర్రెపల్లి శివారులోని వాగు పైన ఉన్న లోలెవల్ క ల్వర్ట్‌పై నుంచి ఉధృతంగా వర్షపు నీరు ప్రవహించింది. దీంతో రోడ్డుపై వెళ్లలేక కొంత సేపు రాకపోకలు అంతరా యం ఏర్పడింది. వాహనదరులు, పాదచారులకు రోడ్డుపై వెళ్ల డానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోలెవల్ వంతెన తొలగించి హై లెవల్ వంతెనను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొడిమ్యాల : కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్ర వారం వర్షం కురిసింది. కోనాపూర్ గ్రామంలో కురిసిన వర్షానికి శం ఖుని కుంట నిండి మత్తడి దూకటంతో కోనాపూర్ వాగు పారుతుంది. వివిధ గ్రామాలకు వెళ్లిన వారు, పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు గ్రామంలోకి తిరిగి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామ మాజీ సర్పంచు స్వా మిరెడ్డి ఆధ్వర్యంలో పులి తిరుపతిగౌడ్ మరి కొందరు యువకులు తాడు సహాయంతో వాగు దాటించారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీవర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రహదారులన్ని వర్షం నీటితో మునిగిపోయాయి. ప్రధానంగా పట్టణంలోని పలువీధుల్లో నీరు డ్రైనేజీలు పైనుంచి ప్రవహించింది. ప్రధానవీధుల్లో భారీగా వర్షం నీరు చేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డా రు. వర్షపునీరు రోడ్లపైనున్న గుంతల్లో వాహనాలు కూరుకుపోయాయి. జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ తోపాటు పలు గ్రా మాల్లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయ మయ్యాయి. పలుకాలనీల్లో రోడ్డుపైకి భారీగా వర్షం నీరు చేర డంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

భీమారం: భీమారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కమ్మరిపేట-వెంకట్రావుపేట గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద రావడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి.



మల్యాలలో జలమయమైన అంగడిబజారు ప్రాంతం...కొడిమ్యాల మండలం కోనాపూర్‌లో వాగు దాటిస్తున్న యువకులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 16: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వెల్ది గ్రామంలోని మానేరువాగు నుంచి కరీంనగర్‌కు ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని చంద్, రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి అదృశ్యం

జ్యోతినగర్, ఆగస్టు 16 : అన్నపూర్ణకాలనీకి చెందిన ధర్మల రామ్మోహన్ (45) అనే సింగరేణి కార్మికుడు అదృశ్యమయ్యాడు. కొన్ని రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన రామ్మోహన్ తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే కొత్తగూడెం వెళ్తున్నానని చెప్పినట్లు అతడి భార్య రాజకుమారి శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బుచ్చి నాయుడు తెలిపారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



ధాన్యం సంచులను బయటకు తెస్తున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 16: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణి రైస్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో గోదావరిఖని ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. సుమారు రెండు గంటల పాటు మంటలను అదుపులోకి తీసుకోచ్చే ప్రయత్నం చేశారు. ఎంత నష్టం వాటిల్లింది అనేది తేల లేదని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 16: జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పెగడపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం సాయంత్రం ఐదుగురు అనిమానిత వ్యక్తుల నుంచి 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన మల్యాల అజయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసిన జగిత్యాల పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై పెగడపల్లి నుంచి బతికపల్లి రోడ్డు మీదుగా వెళ్తుండగా డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్సై కిరణ్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఉన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం



పోలీసుల అదుపులో గంగరాజు

చందుర్తి, ఆగస్టు 16: చందుర్తి మండలం అశిరెడ్డిపల్లి గ్రామంలో అదృశ్యమైన ఎక్కలదేవి గంగరాజు అనే యువకుడి ఆచూకీ శుక్రవారం ఉదయం లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై వివాదంలో ఉన్న భూమి వద్దకు వెళ్లి అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కాగా శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఒర్రె ప్రాంతంలో కొబ్బరి తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి ఉండి, అరుస్తున్న గంగరాజును గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన చేరుకుని గంగరాజును అదుపులోకి తీసు కొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపడుతు న్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంగరాజును ఎవరు, ఎందుకోసం పట్టుకెళ్లి తాళ్లతో బంధించి వదిలేశారు అనేది మిస్టరీ వీడాల్సి ఉంది. కాగా అదృశ్యమైన గంగరాజు ఆరుగురు వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసి ముసు గు కప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారని, తన నోట్లో టవల్ పెట్టడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి పడిపోయానని, శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో కాళ్లు, చేతులు బంధించి వదిలి వెళినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సిరిమల్లే లక్ష్మీనారాయణ(70)శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పవర్‌లూం కార్మికుడిగా పనిచేసే వాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య, పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందారు. చిన్నకుమారుడి వద్ద ఉంటున్న లక్ష్మీనారాయణ వయస్సు భారంతో పని చేయలేక పోతన్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు విధంగానే మదం తాగి అదే మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తన తండ్రి మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి (52) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దేవేందర్‌రెడ్డి వ్యవసాయం చేయడంతో పాటు గత 20 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. దీంతో పాటు మద్యం తాగుతుండే వాడు. ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటుండడంతో స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య నర్మద సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. అక్కడ నుంచే నిత్యం ఎల్లారెడ్డిపేటకు వస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటిలో ఒంటరిగా ఉంటున్న దేవేందర్‌రెడ్డి మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య నర్మద, కొడుకు, కూతురు, తల్లి ఉన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు రాజులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దేవేందర్‌రెడ్డి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య



భాను (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కొండ భాను (40) అనే ఆటో మొబైల్ స్టోర్ యజమాని అప్పుల బాధతో షాప్‌లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన పవర్‌లూం యజమాని కొండ నారా యణ కుమారుడు భాను కొత్తచెరువు కింద ఆటోనగర్‌లో శ్రీకమల్ ఆటోమొబైల్ స్టోర్‌ను పదేళ్ల క్రితం నెలకొల్పాడు. భానుకు ఆరేళ్ల క్రితం దీప్తితో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం భార్యకు చెప్పి ఇంటినుంచి షాప్‌కు వెళ్లాడు. షాప్‌కు వెళ్లి వచ్చేవరకు పిల్లలను అమ్మమ్మ ఇంట్లో దించివచ్చేందుకు రెడీ ఉంచమని చెప్పాడు. మధ్యాహ్నమైన భాను రాకపోవడంతో భార్య ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా దండెం కట్టిన నైలాన్ తాడు కనిపించలేదు.

దీంతో అనుమానం వచ్చిన భార్య వెంటనే ఆమె మరిదికి ఫోన్‌చేసి అన్న ఇంటికి వస్తాననిచెప్పి వెళ్లి రాలేదని చెప్పింది. ఆమె మరిది మరో ఇద్దరు కలిసి ఆటోమొబైల్ స్టోర్‌కు వెళ్లి షటర్ పైకి లేపి చూశారు. భాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆటో మొబైల్ స్టోర్‌లో గత కొంతకాలంగా సక్రమంగా అమ్మకాలు లేవని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో తన భర్త భాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో డిష్ ఆపరేటర్..

కరీంనగర్ క్రైం: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన డిష్ ఆపరేటర్ గీకురు మిథున్ కుమార్(35) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో రాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలిపారు. మిథున్‌కుమార్ డిష్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిథున్‌కుమార్ ఆర్థిక బ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసగా మారాడు. మిథున్ భార్య, రెండు మూడు రోజుల కిందట తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న మిథున్‌కుమార్ శుక్రవారం ఉదయం 5:41 గంటలకు భార్యకు వాట్సాప్‌లో 'సారీ మళ్లీ జీవితం ఉంటే మా బంగారు తల్లుల (కూతుళ్ల) కడుపులో పుడుతా' అంటూ మెస్సేజ్ పెట్టాడు.

మెస్సేజ్‌ను చూసిని అతని భార్య మౌనిక వెంటనే పిల్లలతో కలిసి భగత్‌నగర్ ఇంటికి వచ్చి చూసేసరికి మిథున్‌కుమార్ గది తలుపులు బిగించుకుని ఉన్నాడు. స్థానికుల సహకారంతో బలవంతంగా తలుపులు తెరిచేసరికి ఉరికి వేలా డుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బం దులతో తాగుడకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మిథున్ కుమార్‌కు 7, 5 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి
కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 7,741 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో కేవలం ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరిగి అవకాశాలున్నాయి. దీంతో శనివారం మరో మోటారును ఆన్ చేసే సూచనలు కనబడుతున్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం శుక్రవారం కొనసాగింది. వానాకాలం పంటల సాగు కోసం ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 10,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,603 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంబేద్కర్ విద్యా నిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, ఆగస్టు 16: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, ఉప సంచా లకులు ఎం నగిలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను విదేశీ విద్యాలయాల్లో విద్యను అభ్యసించే ఎస్సీ విద్యార్థులు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ రైతు శంకరపట్నం మండలంలోని కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం గ్రామానికి చెందిన సుంకరి సారయ్య (60) తనకున్న మూడెకరాల భూమిలో ఒక ఎకరం భూమి అదే గ్రామానికి చెందిన పెరుమండ్ల రాజబాబు అనే వ్యక్తికి అమ్మినట్లు తెలిపారు. అతడు ఒక ఎకరం భూమికి బదులుగా మూడెకరాల భూమిని పట్టా చేసుకున్నాడని పేర్కొన్నారు. దాంతో రైతు మనస్థాపం చెంది ఈ నెల 14న మొలంగూర్ నుంచి సైదాపూర్ వెళ్లే దారిలో అరటి తోట వద్ద కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యు లు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 15న అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుంకరి చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (32) అనే మహిళ జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. మహిళకు ఓ ఆర్ఎంపీ చికిత్స అందించగా వైద్యం వికటించి మృతి చెందిందని గ్రామస్థులు, మృతురాలి బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం.. స్వప్నకు జ్వరం రావడంతో రెండు మూడు రోజులుగా ఆర్ఎంపీ వైద్యం అందిస్తున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కొంత సమయం తర్వాత మృతిచెందినట్లు తెలిపారు. వైద్యం వికటించి స్వప్న మృతిచెందినట్లు గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలు
సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు, సౌకర్యాలను తెలుసుకుంటున్న రవీందర్‌నాయక్

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

కొడిమ్యాల, ఆగస్టు 16: ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, ఫ్యామిలీ వెల్ ఫేర్ డా.. రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఆసుపత్రి గదులను, ఇన్‌పేషెంట్ రూంలను, ఫార్మాసిస్ట్ రూంను పరిశీలించారు. పలువురు పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయ్యేలా మహిళలకు అవగాహన కలిపించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జిల్లా, మండల వైద్య అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సేవలను గురించి, అందిస్తున్న మందులను గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలుపాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స ఉచితంగా లభిస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న వైద్య అధికా రులు, సిబ్బంది పని తీరుపట్ల ఫలితం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి గదుల విస్తరణ, కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ కెటాయింపు గురించి డీఎంహెచ్‌వోకు సి ఫారస్ చేశారు. మండల కేంద్రానికి అంబులెన్స్ కెటాయించాలని, ఆ సుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయ కుడు బోగ రాకేష్ హెల్త్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియొద్దీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డా.. శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (ఎన్‌సీడీ) డా. అర్చన, డీపీవో (ఎన్‌హెచ్‌ఎం) డా. రవీందర్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'పోపా' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ (పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్‌కు చెందిన రిటైర్డు టీచర్, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన పోపా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరుగుతూ పద్మశాలి ఐక్యత కోసం కృషిచేయాలని అన్నారు. ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధిగా టీచర్లతో సత్సంబంధాలు కలిగి ఉన్నందున త్వరలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని సత్యనారాయణకు సూచించారు. రాజకీయ రంగంలో పద్మశాలీలు వెనుకబడి ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు పోటీచేసి ఘన విజయం సాధించాలని, ఇందుకోసం పద్మశాలి సంఘాలన్నీ ఐక్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, నాయకులు మంచికట్ల రమేశ్, గోలి వినోద్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పిస్కా లక్ష్మీనారాయణ, కొక్కుల గోవర్ధన్, ఆడెపు శ్రీనివాస్, దేవసాని సంపత్‌కుమార్, రుద్ర రమేశ్, దండె రాజశేఖర్, ఆదిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాన్ని అందుకుంటున్న పోలు సత్యనారాయణ

పోతన కాలనీలో చోరీలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 16: గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతనకాలనీలోని సింగరేణి కార్మిక క్వార్టర్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని 31 బ్లాక్- 427 క్వార్టర్‌లో లాగల అనిల్ ఇంట్లో తాళం పగులగొట్టి రూ.5వేల నగదు, 32 బ్లాక్‌లో నివాసముం టున్న సురేష్ ఇంట్లో 8తులాల వెండి పట్టీలు, 13వ బ్లాక్‌లో బొట్ల సంపత్‌కు చెందిన ద్విచక్ర వాహనం దొంగిలించినట్టు తెలిపారు. వీరందరూ తమ కుటుంబాలతో కలిసి ఊరికి వెళ్లారని, శుక్రవారం తెల్లవారుజామున క్వార్టర్ల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు సమాచారం ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. బాధితులు వచ్చి దొంగతనం జరిగినట్టు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బ్లాక్ నెం.31లో తాళం వేసి ఉన్న 426, 428, 430 క్వార్టర్లలో తాళాలు పగుల గొట్టారని, ఆయా క్వార్టర్లలో ఎవరూ నివాసముండడం లేదన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 16 : మండలంలోని కందుగుల గ్రామ శివారులో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన గండె శ్రీ తిరుపతి అనే వ్యక్తి గ్రామంలో తక్కువ ధరకు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు బియ్యం సంచులతో ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి పక్కగా పారిపోతుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆ వ్యక్తిని బియ్యం అమ్మిన మిల్లుకు తీసుకొని వెళ్లి విచారించగా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యం విలువ రూ. 1,0800 ఉందని తెలిపారు. ఈ మేరకు సీఐ తిరుమల్ కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ఆలయాల్లో ఉద్యాపన, కుంకుమ పూజలు



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి, ఆగస్టు 16: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండవ శుక్రవారం భక్తజన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడ తోడు కావడం వల్ల అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. అలాగే గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో ఉపా వాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మణిదీప వర్ణణ పూజ, లలిత, మహాలక్ష్మి అష్టోత్తరం, పంచామృతాభిషేకం, హారతి పూజలు చేసి నివేదన సమర్పించారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళల కుంకుమ పూజలు

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కోరుట్ల అష్టలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



మెట్‌పల్లిలో వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



కథలాపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

కోరుట్ల, ఆగస్టు 16 : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దేవాలయాలలో నిర్వహించి సామూహిక వరలక్ష్మి మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగాయి. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌తో పాటు వివిధ దేవాలయాలలో విద్యార్థులు వారి తల్లులతో వరలక్ష్మి వ్రత మహోత్సవం నిర్వహించారు. శిశుమందిర్‌లో పాఠశాల నిర్వహకులు సరస్వతి మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ ప్రాంతంలోని దుర్గా దేవి, కోటి నవదుర్గ, అష్టలక్ష్మి దేవాలయాలలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలు అందించగా అధిక సంఖ్యలో మహిళలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాలలో వార్డు కౌన్సిలర్ పెండం గణేష్, ఆలయ నిర్వహకులు బూర్గు రామస్వామి గౌడ్ వేదపం డితులు పాలెపు రాం శర్మ, శ్రీనివాస్, సేనాపతి కృష్ణచంద్రలు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: పట్టణంలోని పురాణిపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు ప్రముఖ వేద పండితులు శ్రీమాన్ నంబి నరసింహాచార్యులు (చిన్న స్వామి) వారి పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వరలక్ష్మీ వ్రత విశిష్టతను చిన్నస్వామి వారు తనదైన శైలిలో అద్భుతంగా వివరించగా, మాతలు పెద్ద సంఖ్యలో వ్రత కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రోహిత్ శర్మ, ఆలయ అధ్యక్షుడు బట్టు సుధాకర్, బోనగిరి శ్రీనివాస్, నూనె రాధాకృష్ణ, రావికంటి రాములు, ఎర్ర రంజిత్, ప్రేమ్, నాగభూషణం పాల్గొన్నారు.

వెల్గటూర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఇంటిల్లిపాది ఉదయమే లేచి తలంటు స్నానాలు ఆచరించి ఇంటిని మామిడి తోరణాలు, పూలతో పూజా మందిరాన్ని అందంగా అలంకరించారు. సుహాసినీలు అమ్మవారి చిత్ర పటాన్ని పూజా మందిరంలో ప్రత్యేక పీఠంపై నిలిపి పూజలు చేశారు. కన్యలను తమ గృహాలకు ఆహ్వానించి పసుపు కుంకుమలు వాయినాలుగా ఇచ్చి సౌభాగ్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాసం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భూషణరావుపేట, కథలాపూర్, సిరికొండ, చింతకుంట గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి మహిళలు బారులు తీరి పూజలు చేశారు. అతిపురాతన ఆలయమైన మద్రవ్వ సన్నిధిలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిం చారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళలు శ్రావణ మాసంలోని రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా జరుపుకొని భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఇళ్లలో వరలక్ష్మీ దేవిని నిలుపుకొని ముత్తయిదువలకు తీపి వంటలను, పండ్లు, ఫలహారం పంపిణీ చేశారు. నిండు నూరేళ్ల సౌభాగ్యవతిగా ఉండాలని మొక్కుకున్నారు.

మల్లాపూర్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. మండల కేంద్రంలోని వాసవిమాత, దుర్గమాత, కనుకసోమేశ్వర ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించినంతరం ఉత్సవ మూర్తులను పురోహితులు అలంకరించారు. వేకువజాము నుంచి ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, వరలక్ష్మి వ్రతం, సామూహిక కుంకమ పూజలను జరిపారు. ఆలయాల్లో పూజలనంతరం భక్తులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలో శ్రావణ శుక్రవారం పురష్కరించుకోని త్రిశక్తి అమ్మవారి ఆలయంతో పాటు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు,అ ర్చనలు, అభిషేకలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాలలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు.

మల్యాల: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి పూజలు చేశారు. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల లాస్య స్కూల్‌లో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో విద్యార్థులు పాల్గొన్నారు. భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సున్న, ఉపాద్యాయురాళ్లు పాల్గొన్నారు.



మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల స్కూల్‌లో విద్యార్థుల పూజలు

ప్రభుత్వ ఆస్పత్రిలోకి వర్షపు నీరు

రోగుల అవస్థలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 : జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోకి వర్షపు నీరు చేరింది. ఉమెన్స్‌వార్డు ప్రక్కనే ఉన్న టాయిలెట్స్ పై గల స్లాబ్ నుంచి వర్షపునీరు లీకై పేషెంట్స్ ఉన్న వార్డులోకి వచ్చి చేరింది. వార్డులోనుంచి వచ్చిన నీరు వరండా లోకి నైతంరావడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. టాయిలెట్స్ దగ్గర నుంచి వర్షపు నీరురావడం కారణంగా వచ్చిన దుర్వాసనతో కొద్దిసేపు రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పందించిన ఆస్పత్రి సిబ్బంది వార్డులో నుంచి వరండామీదుగా వర్షపునీటిని తోడేశారు.

బీర్ టిన్నులో ఇరుక్కున్న పాము

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో



టిన్నులో ఇరుక్కున్న పాము

కొడిమ్యాల, ఆగస్టు 16 : తాగి పడేసిన బీరు టిన్నులో పాము తల ఇరుక్కున వీడియో రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మండలంలోని నల్లగొండ రైతు వేదిక భవనం సమీపంలో తాగి పడేసిన బీరు టిన్నులో ఒక పాము తల ఇరుక్కుంది. టిన్ను నుంచి తలను తీసుకోవటానికి పాము చేసిన ప్రయత్నాలు ఫలించలేదు అటు వైపుగా వెళ్లిన గ్రామస్థులు తీసిన వీడియో ప్రస్తుత్తం వైరల్‌గా మారింది. కొంత సేపటికి పాము తల టిన్ను నుంచి బయటకు రాగ పాము పొదల్లోకి వెళ్లిపోయింది.

టీషర్టుల పంపిణీ

కొడిమ్యాల, ఆగస్టు 16 : మండలంలోని పూడూర్ గ్రామంలో శుక్రవారం మాజీ ఉప సర్పంచు బండ లింగారెడ్డి 27 మంది యువకులకు 12వేల రూపాయల విలువైన టీషర్టులను కొడిమ్యాల ఎస్సై సందీప్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గాదె మల్లేశం, కొత్త రమేష్, సాజన్, పూడూర్ యువకులు పాల్గొన్నారు. ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎస్సైని మండలంలోని పలువురు మాజీ సర్పంచులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఏగుర్ల తిరుపతి, స్వామిరెడ్డి, మల్లేశం, మహిపాల్, నాయకులు రమేష్, తిరుపతి ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి వీడ్కోలు

కొడిమ్యాల, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని యూనిన్ బ్యాంక్‌లో ఎనిమిదేళ్లుగా సేవలు అందించి బదిలీపై వెల్లుతున్న కార్తిక్‌ను బ్యాంక్ మేనేజర్ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ రాజ్‌కుమార్, ఆర్‌డీవో గజానన, గోల్డ్ అప్రైజర్ ముమ్మాడి స్వామి, సింగిల్ విండో డైరెక్టర్ గంగరాజం, మాజీ కోఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, రైతు నాయకుడు లచ్చిరెడ్డి, వైశ్య సంఘం నాయకుడు పాలకుర్తి శ్రీనివాస్, ఖాతాదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ కార్యవర్గాల నియామకం

జగిత్యాలరూరల్, ఆగస్టు 16 : జగిత్యాలరూరల్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన పిన్నంశెట్టి సదానందం నియామకమయ్యారు. అలాగే జగిత్యాల అర్బన్, రూరల్‌మండలం యూత్ కోఆర్డినేటర్‌గా కల్లూరి హరీష్‌ను నియమిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోకబాపురెడ్డి, నాయకులు అసిప్, కమలాకర్‌రావు, దయాలమల్లారెడ్డి, మల్లేశం, వెంకటేశ్వర్‌రావు, గంగాదర్ పాల్గొన్నారు.

లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేత

మెట్‌పల్లి, ఆగస్టు 16(ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. జాతీయ బాష హిందీ ప్రచారం, వివిధ సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ సత్య ఇందిరా ఫౌండేషన్ జైపూర్ వారు లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న సత్యానారాయణను పలువురు ఉపాధ్యాయులు, బంధు, మిత్రులు అభినందించారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

రాయికల్, ఆగస్టు 16: రాయికల్ పట్టణ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ పట్టణ సెక్రెటరీ బన్న హరీష్ మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీ రక్షాబంధన్ అని, ప్రతి ఒక్కరూ సోదరసోదరి భావనతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాలికలచే బాలురకు రాఖీ కట్టించారు. విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. ఒకరికొక్కరు రక్షలు కట్టుకొని సోదర బావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జయపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు నివాళులు

మెట్‌పల్లి, అగస్టు 16(ఇబ్రహీంపట్నం): పట్టణం లోని 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ మర్రి పోచయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన పార్థీవ దేహానికి శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. ఆయన మరణం వార్డుకు తీరని లోటు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, పూదరి నర్సాగౌడ్, లక్ష్మణ్, రాజయ్య, పలువురు బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు.

సేవా పథకానికి ఎంపిక

మెట్‌పల్లి, ఆగస్టు 16 (ఇబ్రహీంపట్నం): జిల్లా పోలీస్ ఐటీ విభాగంలో పనిచేస్తున్న మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొండ రఘుపతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సేవా పథకానికి ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఐటి విభాగంలో పని చేస్తున్న రఘుపతి డీజీపీ మహేందర్‌రెడ్డి సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సేవా పథకం అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డును ఎస్పీ ప్రదానం చేసి అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన రియల్‌ఎస్టేట్ నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16: జగిత్యాల రియల్ ఎస్టేట్ అండ్ కన్స్‌ట్రక్షన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్యవర్గానికి ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. ఎల్లవేళలా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రంగు శ్రీనివాస్, జమాల్, వివిధ హోదాల సభ్యులు జంగ తిరుపతి, పూసల శేఖర్, సత్యం, అబ్దుల్ సలాం, మాజీ సర్పంచ్ దుమాల తిరుపతి, వెంకటస్వామి, నారాయణ, షాకీర్, శ్రీధర్‌రెడ్డి, శివ, రవి తదితరులున్నారు.

- జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇంటర్మీడియేట్ నోడల్ అధికారిగా నియమితులైన వెంకటేశ్వర్లు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, లెక్చరర్ విజయ్ తదితరులున్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి, ఆగస్టు 16(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని పలు వార్డులలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మోహన్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఆటోలకు అందించాలని లేదంటే చెత్త సేకరించబడదన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు వాడాలని కోరారు. మురికి కాల్వలకు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది విష్ణు, ముజిబ్ ఉన్నారు.


ఆస్పత్రుల బంద్‌కు సహకరించాలి

ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు రాజేష్

కోరుట్ల, ఆగస్టు 16 : దేశ వ్యాప్తంగా నిర్వహిస్తు వైద్య సేవల నిలి పివేతకు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సహకారం అందించాలని ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ రేగోండ రాజేష్, ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అనూఫ్ రావు కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక వైద్యులతో కలిసి మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఆర్‌జీ కరా వైద్య కళాశాలలో పీజీ విద్యార్థినిని పైశాచికంగా హత్య చేసినందుకు నిరస నగా ఆసుపత్రులు బందు నిర్వహించి ఒక రోజుల వైద్య సేవలు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో నిర్వహించే నిరసన ర్యాలీలో అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్‌లో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నేపథ్యంలో మెట్‌పల్లి, కోరుట్లలో శనివారం అసుపత్రులు బంధు పాటిస్తున్నాట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గంగాసాగర్ తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణాల్లో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం ఇవ్వానున్నాట్లు తెలిపారు.

విద్యుత్ శాఖలో పదోన్నతులు



పదోన్నతి పత్రాలను అందజేస్తున్న ఏడీఏ శ్రీనివాస్

మల్లాపూర్, ఆగస్టు 16: మల్లాపూర్ విద్యుత్ శాఖలోని పలువురు జూనియర్ లైన్‌మెన్‌లకు పదోన్నతులు లభించాయి. శుక్రవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌కో కార్యాలయంలో పదోన్నతులు పొందిన వారికి ఏడీఏ శ్రీనివాస్ పత్రాలు అందజేశారు. మండలంలోని మొగిలిపేట కు చెందిన విష్ణు, ఓబులాపూర్‌లోని క్రాంతి, మల్లాపూర్‌లోని రంజిత్, కొత్తధాంరాజుపల్లి రాజేష్, వేంపల్లి వినోద్, గొర్రెపల్లిలో పనిచేస్తున్న ఇసాక్ జూనియర్ లైన్‌మెన్‌గా పనులు విదులు చేస్తున్న వారికి అసిస్టెంట్ లైన్‌మెన్‌గా నియమించిన పత్రాలను ఏడీఏ అందజేశారు. పదోన్నతులు పొందిన వారిని సిబ్బంది, రైతులు అభినందించారు.

విద్యుత్ కష్టాలను నిరసిస్తూ సబ్ స్టేషన్ ముట్టడి

● వ్యవసాయ మోటార్లు కాలిపోవడంతో ఆగ్రహం ● వర్షకొండ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

ఇబ్రహీంపట్నం, అగస్టు 16: నాలుగు రోజులుగా కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడుతున్న రైతులు ఆగ్రహంతో ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. వర్షకొండలో వ్యవసాయ మోటార్లకు అందించే విద్యుత్ సరఫరాలో నాలుగు రోజులుగా అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సబ్ స్టేషన్‌లోని బ్రేకర్‌ల వద్దకు వెళ్లి హంగామా చేశారు. లోవోల్టేజీ కారణంగా విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు సబ్‌స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామానికి ఒక్క ఫీడర్ లైను ఇవ్వడం వల్ల లోవోల్టేజీ సమస్య ఏర్పడుతోందని దీంతో విద్యుత్‌కు నిత్యం అంతరాయం ఏర్పడుతోందన్నారు. లో వోల్టేజీ కారణంగా ఇప్పటికే 150 వరకు వ్యవసాయ విద్యుత్ మోటార్లు కాలిపోయాయని వాటికి నష్ట పరిహారం అందించాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. కోమటికొండాపూర్ గ్రామస్థులతో అధికారులు కుమ్మకై రెండు ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి రైతులను శాంతింపజేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు రైతులు వినతి పత్రం అందజేశారు. అయితే వర్షకొండ సబ్‌స్టేషన్‌లో నెలకొన్న సమస్యను పరిష్కరించామని మెట్‌పల్లి డీఈ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 11 కెవి ఫీడర్లు రెండు కలిపి ఒకే బ్రేకర్‌కు అనుసంధానించి ఉండటం వలన రెండు రోజులుగా ఎక్కువగా అంతరాయం ఏర్పడిందన్నారు. లోడ్‌కు అనుగుణంగా బ్రేకర్‌ను సరిచేసినట్లు డీఈ తెలిపారు.



సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తున్న రైతులు

దరఖాస్తులకు ఆహ్వానం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఓవరీస్ విద్యానిధి పథకం కింద విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, సౌత్ కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చదవా లనుకుంటున్న విద్యార్థులకు సువర్ణ అవకాశమన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీ నుంచి తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసు కోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. జిల్లాకు చెందిన ఎస్సీ కులస్తులై ఉండాలని, సంవత్సర ఆదాయం రూ.5లక్షలకు మించరాదని, గ్రాడ్యుయేషన్‌లో 60శాతం ఎక్కువ మార్కులుండాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, ఆగస్టు 16: మండలంలోని అల్లీపూర్ పీఏసీఎస్ చైర్మన్ యాదవనేని రాజలింగం అక్క యాదవనేని రాజసులోచన ఇటీవల మరణించగా వారి కుటుంబసభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు. వారి వెంట వెంకటేష్, ముఖీద్, శివ ఉన్నారు.

కొనసాగుతున్న జర్నలిస్టుల దీక్షలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 16: ఇళ్ల స్థలాల సాధనకోసం జగిత్యాల జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారానికి 14వ రోజుకు చేరింది. పలు సంఘాల నాయకులు దీక్షా శిబిరం సందర్శించి సంఘీభావం తెలిపారు. ముప్పై ఏళ్లగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న పాత్రికేయులకు ఇళ్లు కేటాయించకపోవడం విచారకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

'ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి'

కోరుట్ల రూరల్, ఆగస్టు 16 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధి రోహించాలని తహసీల్దార్ కిషన్ సూచించారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థులకు విద్యాబోధనను అందించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సాంఘిక, గణితంపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనం పరిశీలించి వారికి అందించే మెనూ వివరాలను ప్రిన్సిపల్ సుమలతను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోని విద్యార్థులకు అంటు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో డ్రైడే కార్యక్రమాలను గామ పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేంధర్ రావులతో పాటు విద్యార్థులు గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

- మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కోరుట్ల, ఆగస్టు 16: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని సైబర్ నేరాలకు తావివ్వకుండా అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాస్టర్ మైండ్ కంప్యూటర్ ఎడ్యూకేషన్‌లో కంప్యూటర్ విద్య పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అందించిన సర్టిఫికెట్లను డీఎస్పీ పంపిణీ చేశారు. అనంతరం సైబర్ నేరాలు, మత్తుపదార్థాలతో జరిగే అనార్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడా రు. భవిష్యత్‌పై దుష్టి సారించి అనుకున్న లక్ష్యం సాధించాలని అన్నారు. డీఎస్పీ ఉమామహేశ్వర రావు, కోరుట్ల సీఐ సురుష్ బాబులను సన్మానించి అభినందించారు. మాస్టో కళాశాల ప్రిన్సిపల్ అకుల రాజేష్‌లతో పాటు మాస్టర్ మైండ్ నిర్వహకులు పాల్గొన్నారు.



డీఎస్పీ మహేశ్వర్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం

కథలాపూర్, ఆగస్టు 16 : బస్సుల్లో ప్రయాణించే మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్స్‌లు చేస్తారని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కథలాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పులి శిరీష నేతృత్వంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బస్టాండ్ వద్ద కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించి మహిళలను కించపరిచేలా మాట్లాడడం శోచనీ యమని ఆరోపించారు. మహిళల పట్ల బీఆర్ఎస్‌కు చిన్న చూపు ఉందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని అన్నారు. లక్ష్మీ, రాధ, మమత, అమ్మాయి, లావణ్య, బేగం నర్సు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, హరిప్రసాద్, అజీం, నారాయణరెడ్డి, సత్యనారాయణ, మోహన్, చిన్నారెడ్డి, అశోక్ ఉన్నారు.

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళామణులకు ఫ్రీ బస్సును అవహేళన చేస్తూ మహిళలను కించపరిచిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం దహనం చేశారు. ఒకపక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను గౌరవిస్తూ అన్ని రంగాల్లో ముందుండేల్లా ప్రణాళికలు రూపొందిస్తుంటే కేటీఆర్ మాత్రం ఇలా మాట్లాడటం సరి కాదన్నారు. కేటీఆర్ తక్షణమే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమారం, మేడిపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ఏనుగు రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు